సాక్షి ఒడిశా

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,66,243లు, బంగారం 6గ్రాముల 40 మిల్లీగ్రాములు వెండి 239 గ్రాముల 940 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అక్రమ మద్యం వ్యవస్థను కూలదోస్తాం

రాష్ట్రంలో అక్రమ మద్యం వ్యవస్థని సంపూర్ణంగా కూలదోస్తామని రాష్ట్ర ఎక్సైజ్, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. - 8లో



మహేంద్రగిరిలో టూరిస్టు కాటేజీలు

ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం మహేంద్రగిరి వద్ద రాష్ట్ర టూరిజం శాఖ 10 టూరిస్టు కాటేజీలు నిర్మించింది. - 8లో

న్యూస్‌రీల్

గజలక్ష్మీ పూజకు ముహూర్తపు రాట



ముహూర్తపు రాట కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

రాయగడ: స్థానిక న్యూకాలనీలో అక్టోబర్ 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్న గజలక్ష్మీ పూజలకు శుక్రవారం ముహూర్తపు రాట కార్యక్రమం జరిగింది. ప్రధాన అర్చకుడు సురేష్ చంద్ర సామంతరాయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. 12 రోజుల పాటు గా కొనసాగే ఈ పూజలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సన్నాహాలు చేస్తున్నట్లు సంతోష్‌కుమార్ పాత్రో తెలిపారు. గత 28 ఏళ్లుగా గజలక్ష్మీ పూజలను నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ కార్యదర్శిగా ఎస్.త్రినాథరావు, ముఖ్య సలహాదారులుగా సవ్యసాచి సాహు, మదన్ పాడి, కోశాధికారిగా దిలీప్ కుమార్‌లు నియమితులవ్వగా, కార్యవర్గ సభ్యులుగా మనోజ్ సాహు, బాలాజీ పాడి, కిషోర్ సాహు, కిషన్ అగ్రవాల్ తదితరులు నియమితులయ్యారు.

మునిగుడ ఐఐసీపై ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళలు

రాయగడ: మునిగుడ ఐఐసీ సౌదామిణి బెహరపై ఎస్పీ హరీష్ బిసికి ఇద్దరు మహిళలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని మునిగుడ గోవర్ధన్ కాలనీలో నివసిస్తున్న లావణ్య పాణిగ్రహి అనే మహిళ తన కాలనీకి చెందిన హేమలత నాయక్ అనే మహిళతో కలిసి ఈనెల 23వ తేదీన మునిగుడ పోలీస్‌స్టేషన్‌కు ఒక కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు వెళ్లారు. కొంత సమయం తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఐఐసీ సౌదామిణి బెహర ఎందుకు వచ్చారని వివరాలు తెలుసుకోకుండా దురుసుగా ప్రవర్తించారని, అంతేకాకుండా చేయిచేసుకునే వరకు హద్దులు దాటారని ఆరోపించారు. దీంతో భయపడి పోలీస్‌స్టేషన్ నుంచి భయంతో వెళ్లిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో గౌరవంగా వ్యవహరించడంతో పాటు అసలు దేనికి వచ్చారు అనే వివరాలు తెలుసుకోకుండా ఇలా అమానుషంగా ప్రవర్తించడం విచారకరమన్నారు. దీనిపై దర్యాప్తు జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ స్పందించి సమగ్రంగా దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



ఆటో నుంచి గంజాయిని దించుతున్న పోలీసులు

కొరాపుట్: ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలో ఆటోలో గంజాయి రవాణా అవుతున్నట్లు కొరాపుట్ జిల్లా ఎస్పీ అభినవ శుంకర్‌కి సమాచారం వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో నందపూర్, లమ్తాపుట్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఒక ఆటో అనుమానాస్పదంగా ఉండడంతో పరిశీలించారు. ఆటో పైభాగంలో ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసి అందులో గంజాయి ఉంచారు. అందులో ఉన్న 90 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, ఆటోలోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

విలువైన కలప స్వాధీనం

జయపురం: బిసింగపూర్ సెక్షన్‌లోని పటియాసిల్ గ్రామ సమీప అడవిలో అటవీ విభాగ సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి విలువైన గుగ్గిలం కలపను స్వాధీనం చేసుకున్నట్లు బొరిగుమ్మ అటవీ విభాగ అధికారి డొంబురు దొర గొమాంగో శుక్రవారం తెలియజేశారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని వెల్లడించారు. దాడుల్లో ఫారెస్టర్లు సుధామ్ శతపతి, శివశంకర మహాపాత్రో, సిబ్బంది ప్రశాంత మిశ్ర, లలిత బిడిక, ఫారెస్టు గార్డు కుమారి రేఖారాణి సాహు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్



లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరికైనా చెల్లింపులు చేసుకునే అవకాశం ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉంది. పెరుగుతున్న టెక్నాలజీలో భాగంగా ప్రతి ఒక్కరి జీవితంలో డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు ఒక భాగమైపోయాయి. దీంతో వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బొప్పన్‌పల్లి పంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నాబోకిషోర్ మల్లిక్ వినూత్న ఆలోచన చేశారు. చెల్లింపులపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో కృత్రిమ మార్కెట్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అమ్మకాలు, కొనుగోలు చేసేటప్పుడు ఫోన్ పే వంటివి ఉపయోగించే పద్ధతిని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

\- మల్కన్‌గిరి



క్యూ ఆర్ కోడ్ పెట్టుకొని అమ్మకాలు జరుపుతున్న విద్యార్థులు



కూరగాయల వ్యాపారం చేస్తున్న విద్యార్థులు



మెకానిక్ సామగ్రి అమ్మకాలు



దుస్తుల దుకాణంలో ఫోన్‌పే చేస్తున్న విద్యార్థి



కోళ్లను అమ్ముతున్న విద్యార్థులు



చీపుర్లు అమ్ముతున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

- ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు కలెక్టర్లు
- సీఎం మోహన్ చరణ్ మాఝీ
- కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాలు ప్రారంభం



ప్రసంగిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: ప్రభుత్వాలు అమలు చేసే ప్రతీ పథకం, కార్యక్రమం ప్రజలకు చేరాలని సీఎం మోహన్‌చరణ్ మాఝీ సూచించారు. స్థానిక లోక్‌సేవా భవన్ కన్వెన్షన్ సుముదాయంలో కలెక్టర్లు, ఎస్పీలతో రెండు రోజుల సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు కలెక్టర్లే ప్రభుత్వమన్నారు. సగటు పౌరుడు ప్రభుత్వ సంబంధిత కార్యకలాపాల కోసం కలెక్టరునే సంప్రదిస్తారని తెలిపారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారు వారధిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. తన 27 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో సామాన్య ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేసుకున్నారు. కొత్త ప్రభుత్వం సరికొత్త పోకడతో ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడాలు పాల్గొన్నారు.

సఖ్యతతో మెలగాలి

ప్రజా ప్రతినిధులతో అధికారులు సఖ్యతతో మెలగాలని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు పోలీసులతో అవమానకర పరిస్థితులను ఎదుర్కోవడం వంటి పరిస్థితులు విచారకరమన్నారు. ఈ సంస్కృతికి తెర దించాలని తెలిపారు. ప్రజా పాలనలో తమ ప్రభుత్వం అవినీతితో ఏమాత్రం రాజీ కుదిరే పరిస్థితి ఉండబోదని సభాముఖంగా స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెడుతుందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరదీసే బాధ్యత జిల్లా కలెక్టర్లదిగా పేర్కొన్నారు.

జాప్యం నివారించాలి

ప్రజలకు సకాలంలో ప్రభుత్వ పథకాలు అందాలని, ఆ విషయంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని హెచ్చరించారు. వ్యూహాత్మక కార్యాచరణతో ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెడుతుందని, ప్రజలకు వీటిని చేరదీయకుంటే ప్రభుత్వం కృషి నిరీర్యం అవుతుందన్నారు. సకాలంలో ప్రజలకు అక్కరకు రాని ప్రభుత్వ పథకాలు నిష్ప్రయోజనమవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశం రెండో రోజున రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సూపరింటెండెంట్లతో ఉంటుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.



సమావేశంలో పాల్గొన్న సీఎం, ఉపముఖ్యమంత్రులు

మాజీ ఉప రాష్ట్రపతికి స్వాగతం



వెంకయ్య నాయుడితో మాట్లాడుతున్న సీఎం మోహన్



వెంకయ్య నాయుడికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న గవర్నర్ రఘుబర్ దాస్

భువనేశ్వర్: రాష్ట్ర పర్యటనకు శుక్రవారం విచ్చేసిన భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుకు గవర్నర్ రఘుబర దాస్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఉన్నత భారతదేశం ఆవిష్కరణ నేపథ్యంలో వీరివురి మధ్య సంభాషణ జరిగిందని గవర్నర్ తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆయనతో భేటీ అయ్యారు.

కొలిక్కి వచ్చిన వివాదం



సర్వే చేపడుతున్న ఇరు రాష్ట్రాల అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సరిహద్దు గ్రామం బూదర సమీపంలో ఉన్న ఇసుక ర్యాంపుపై ఆంధ్రా, ఒడిశా మధ్య కొనసాగుతున్న వివాదం కొలిక్కి వచ్చింది. గత మూడు నెలలుగా ఈ వివాదం నడుస్తుండడంతో అధికారులు చివరకు సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా ఈ భూభాగం ఒడిశాదే అని నిర్ధారించారు. గజపతి జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, మైనింగ్ అధికారి దీపెన్ పోరిడా, తహసీల్దార్ డంబుధర మల్లిక్, అదనపు తహసీల్దార్ త్రినాథ సాహులు శ్రీకాకుళం జిల్లా పాలకొండ అదనపు కలెక్టర్ జస్వంత్ కుమార్ రెడ్డికి ఒడిశా మ్యాప్‌లు, ఆధారాలు చూపించి విజయం సాధించారు. దీంతో బూదర సమీపంలో ఉన్న ఇసుక ర్యాంప్ ఒడిశాదే అని స్పష్టం చేశారు. గతంలో బూదర ఇసుక ర్యాంప్‌లపై ఒడిశా ప్రభుత్వమే టెండర్లు కూడా పిలిచింది. ఉభయ రాష్ట్రాల సర్వే నివేదికలు శ్రీకాకుళం కలెక్టర్, గజపతి కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో వివాదం తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలని ఇరురాష్ట్రాల రెవెన్యూ అధికారులు నిర్ణయించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న దీదాయి తెగ గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కుదుములగుమ్మ పంచాయతీ కార్యాలయం వద్ద గిరిజనులు శుక్రవారం ఆందోళన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దీదాయి తెగకు గిరిజనులు 7 డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమితి కార్యాలయంలో అధికారి కిరణ్ నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా దీదాయి సంఘ అధ్యక్షుడు బషిధర్ ముదిలి మాట్లాడుతూ.. తమకు రావాల్సిన హక్కులను న్యాయబద్ధంగా కల్పించాలని కోరారు. అటవీ భూములను తమకు లీజుకు ఇప్పించాలన్నారు. అలాగే గ్రామంలో పాఠశాల నిర్మించడంతో పాటు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: స్థానిక పాతగేటు వద్దనున్న శ్రీరామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఏఎస్పీ బిష్ణుప్రసాద్ పాత్రో ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్న దాతలను అభినందించారు. ఇటువంటి సేవాభావంతో స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. కొంతమంది అపోహలతో రక్తదానం చేసేందుకు ముందుకు రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అటువంటి వారిని యువత చైతన్యపరచాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్.చంద్రశేఖర్‌రావు, కార్యదర్శి ఎల్ఎం రావు, కోశాధికారి కె.శ్రీధర్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షించారు. శిబిరంలో 35 యూనిట్ల రక్తం సేకరించారు.

స్క్రబ్ టైఫస్‌తో వ్యక్తి మృతి



నియాలిలో పర్యటిస్తున్న వైద్య బృందం

భువనేశ్వర్: కటక్ జిల్లాలో స్క్రబ్ టైఫస్ మృతి వెలుగు చూసింది. ఈ జిల్లాలోని నియాలి గ్రామంలో ఒక వ్యక్తి ఈ వ్యాధితో మృతి చెందడం కలకలం రేపింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ వైద్య బృందం ఘటనా స్థలాన్ని ప్రత్యక్షంగా శుక్రవారం సందర్శించింది. గ్రామ పరిసరాలను పరిశీలించడంతో పాటు 60 మంది రక్త నమూనా సేకరించింది. వీటి నివేదిక ఆధారంగా తదుపరి కార్యాచరణ కొనసాగిస్తారని వైద్య బృందం సమాచారం.

చిత్రకొండలో 'మావో' వ్యతిరేక పోస్టర్లు



జోడాంబో వద్ద వెలిసిన మావో వ్యతిరేక పోస్టర్



రల్లేగేడ పంచాయతీలో పాఠశాల గోడపై అతికించిన పోస్టర్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబ్, పనాస్‌పూట్, జాన్‌బాయి, జాంత్రీ, గురశేతు, మత్తిలి సమితిలోని పలు ప్రాంతాల్లో మావో వ్యతిరేక బ్యానర్లు శుక్రవారం వెలిశాయి. పలు ఆదివాసీ సంఘాల సభ్యులు ఈ పోస్టర్లను అతికించారు. ఈత ప్రాంతానికి చెందిన ఎంతోమంది గిరిజన యువతీ, యువకులు మావోయిస్టుల దళంలో చేరి కుటుంబాలకు దూరమయ్యారని పోస్టర్లలో పేర్కొన్నారు. ఎన్నో సార్లు తమ పిల్లల మృతదేహాలను కూడా తల్లిదండ్రులు చూసుకునే అవకాశం లేకపోయిందన్నారు. మావోయిస్టుల అగ్రనేతల కోసం జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో ఈ ప్రాంతాలకు చెందిన గిరిజనులే మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి జవాన్లు వచ్చి తమ అభివృద్ధికి దోహదపడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా తమ పిల్లలను వదిలేయాలని కోరారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గొమాంగో

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ ఉన్న లయన్స్ క్లబ్ ఆఫ్ వంశధార ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపం వద్ద ఉచిత వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అంతంతమాత్రంగా ఉన్న వైద్య సౌకర్యాలు కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మెరుగైన వైద్య సౌకర్యాలను పొందాలంటే లయన్స్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి ఇటువంటి తరహా వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి తరహా సేవలు అవశ్యమని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ సాహు, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రశన్న కుమార్ మిశ్రా, సభ్యులు ఉమాచరణ్ పట్నాయక్, సుమన్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పంచ లింగేశ్వర్ సందర్శన నిలిపివేత

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రం పంచలింగేశ్వర్ సందర్శన తాత్కాలికంగా నిలిపివేశారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాల కారణంగా నిత్యం ఈ పంచ లింగాలపై ప్రవహించే నీటి స్రవంతి పొంగిపొర్లుతోంది. ఈ ప్రాంగణంలో పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. అవాంఛనీయ సంఘటనల నివారణ నేపథ్యంలో సందర్శకుల ఆగమనం నివారించారు. అల్లంత దూరం నుంచి పూజాదులు ముగించి వెనుకకు పంపిస్తున్నారు. ఈ పరిస్థితిపై పర్యాటకుల్లో అసంతృప్తి చోటు చేసుకుంటుంది.

ఓపీఎస్‌సీ నూతన చైర్మన్‌గా అరుణ్‌కుమార్



భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను ఓపీఎస్‌సీ నూతన అధ్యక్షుడిగా 1990 సంవత్సరపు బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి అరుణ్ కుమార్ షడంగి నియమితులయ్యారు. ఈ పదవి, హోదాలో ఆయన నిరవధికంగా 6 ఏళ్లు లేదా 62 ఏళ్లు వయసు నిండేంత వరకు కొనసాగుతారని ఉత్తర్వులు పేర్కొన్నాయి. 2027 సంవత్సరం జూలై 25వ తేదీతో అరుణ్ కుమార్ షడంగికి 62 ఏళ్లు నిండుతాయి. ఈ లెక్కన ఆయన ఓపీఎస్‌సీ అధ్యక్షుని హోదాలో నిరవధికంగా 2 సంవత్సరాల 10 నెలలపాటు కొనసాగుతారు. ఈ ఏడాది ఆగస్టు 16 వరకు ఆయన రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆయన స్థానిక బిజూ పట్నాయక్ రాష్ట్ర పోలీసు అకాడెమీ బీపీఎస్‌పీఏ శిక్షణ విభాగం ప్రత్యేక డైరెక్టర్ జనరల్, డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రాయగడ: జిల్లాలోని అత్యంత వెనుకబడిన సమితిగా గుర్తింపు పొందిన చంద్రపూర్‌లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో అన్నారు. శుక్రవారం చంద్రపూర్ పీహెచ్‌సీలో జరిగిన రోగి కల్యాణ సమితి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పీహెచ్‌సీకి సుదూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగులకు సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యం కోసం తరచూ వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు.

హిరాకుడ్ 7 గేట్లు ఎత్తివేత



వరద నీరు విడుదలవుతున్న దృశ్యం

భువనేశ్వర్: మహానది ఎగువ ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో కుండపోత వర్షంలో హిరాకుద్ జలాశయం నీటితో నిండింది. ఈ పరిస్థితి నియంత్రణ కోసం గేట్లు అంచెలంచెలుగా తెరిచి వరద నీరు సురక్షితంగా విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 7 గేట్ల ద్వారా లోతట్టు ప్రాంతాలకు నీరు విడుదలవుతోంది. హిరాకుద్ ఆనకట్ట కుడి వైపు 2, ఎడమ వైపు 5 గేట్లు తెరిచారు. జలాశయం లోనికి ప్రతి సెకనుకు 1 లక్ష 7 వేల 140 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సమానంగా 1 లక్షా 7 వేల 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రబినారాయణ



జయపురం: బీజేడీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా జయపురం మాజీ ఎమ్మెల్యే రబినారాయణ నందోని ఆ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ గురువారం నియమించారని ఆ పార్టీ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఈ కమిటీలో మొత్తం 16 మంది సభ్యులను నియమించారని, వారిలో నందోకు స్థానం కల్పించడం హర్షణీయమన్నారు.

మల్కన్‌గిరి: ఆందోళనలో పాల్గొన్న నర్సులు



జయపురం: ఆందోళన చేపడుతున్న నర్సులు



సమస్యలు పరిష్కరించాలని..!

మల్కన్‌గిరి: జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా నర్సులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లాలోని 7 సమితుల్లో ఉన్న నర్సులు కూడా వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా నర్సుల సంఘం అధ్యక్షురాలు భారతి బెహర మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

పర్లాకిమిడి: అఖిల ఒడిశా నర్సుల అందోళన మూడో రోజుకు చేరుకుంది. శుక్రవారం నుంచి నర్సులు ప్రసూతి విభాగంలో అత్యవసర సేవలు కూడా బహిష్కరించడంతో గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులు పడ్డారు. నర్సుల న్యాయమైన పది డిమాండ్లు నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఎంసీహెచ్ ఆస్పత్రి వద్ద బైఠాయించారు. ఈ ఆందోళన ఇంకా ఉధృతం చేస్తామని గజపతి జిల్లా శాఖ నర్సుల సంఘం సాధారణ కార్యదర్శి అనితా కుమారీ పాత్రో, అధ్యక్షురాలు అన్నపూర్ణ చాంది తెలియజేశారు.

జయపురం: తమ పది డిమాండ్ల సాధనకు నిరవధిక ఆందోళన చేయాలని రాష్ట్ర నర్సుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శుక్రవారం నర్సులు ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో ఉన్న ప్లకార్డులు చేత బట్టి నినాదాలు చేశారు. సంఘ అధ్యక్షురాలు ప్రేమలత మహరాణ నేతృత్వంలో ప్రారంభమైన ఆందోళనల వలన అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25వ నుంచే నర్సులు విధులు బహిష్కరించి ఆందోళన జరుపుతున్నారని, అయితే కొన్ని కారణాల వలన జయపురంలో శుక్రవారం నుంచి ఆందోళనలో పాల్గొంటున్నట్లు ప్రేమలత మహారాణ వెల్లడించారు. ఆందోళనలో సంఘ ఉపాధ్యక్షుడు మధుస్మిత స్వైం, సాధారణ కార్యదర్శి లక్ష్మీరాణి సేనాపతి, సహాయ కార్యదర్శి స్వరూప సాహు తదితరులు పాల్గొన్నారు.

అంతర్విభాగ కమిటీ ఏర్పాటు

భువనేశ్వర్: దీర్ఘకాలిక 10 ప్రధాన డిమాండ్ల సాధన కోసం గత రెండు రోజులుగా రాష్ట్ర స్థాయిలో నర్సులు విధుల బహిష్కరణ ఆందోళన కొనసాగిస్తున్నారు. విధుల బహిష్కరణ పరిస్థితి నివారించే దిశలో ప్రభుత్వ వర్గాలు ఆందోళనకారులతో సమావేశమయ్యారు. అనంతరం వీరి డిమాండ్లు నెరవేర్చే దృక్పథంతో అంతర్ విభాగ కమిటీ ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో నర్సులు ఆందోళన విరమించి విధుల్లో చేరాలని అభ్యర్థించారు.



పర్లాకిమిడి: ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేస్తున్న గజపతి జిల్లా నర్సులు

భరత్‌పూర్ దర్యాప్తు ముమ్మరం



భువనేశ్వర్: భరతపూర్ ఠాణాలో సైనికాధికారి, అతని స్నేహితురాలిపై పోలీసుల లైంగిక దాడి వంటి ఆరోపణల వివాదంపై దర్యాప్తు ముమ్మరం అవుతోంది. ఈ ఘటనపై ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. త్వరలో ఈ మేరకు నోటిఫికేషన్ జారీ కానుంది. అంతకు ముందు ఈ సంఘటనపై విచారణకు క్రైం శాఖని నియమించిన విషయం తెలిసిందే. ఈ విచారణ నిరవధికంగా కొనసాగుతోంది. ఈ విచారణలో అసత్యం ముసుగు తొలగించి వాస్తవాస్తవాలతో సమగ్ర నివేదికని దాఖలు చేసే దిశలో క్రైం శాఖ ఆచితూచి అడుగులు వేస్తోంది. సంఘటన వెలుగు చూడడంతో ప్రభుత్వం ఠాణా ఇన్‌చార్జితో సహా 5 మంది సిబ్బందిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఈ చర్య కంటి తుడుపు వైఖరిగా పేర్కొని సముచిత న్యాయం జరపాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు విచారణ ఊపందుకుంది.

లై డిటెక్షన్ పరీక్ష

ఈ ఘటనలో నిందితులు, బాధితులు ఉభయ వర్గాలకు క్రైం శాఖ దర్యాప్తు బృందం లై డిటెక్షన్ నిర్వహించాలని యోచించింది. దీంతో బ్రెయిన్ మ్యాపింగ్, నార్కో విశ్లేషణ వంటి లోతైన పరిశోధనల కోసం ఈ వర్గం న్యాయస్థానం అనుమతి అభ్యర్థించింది. వీరి అభ్యర్థనకు ప్రధాన నిందితుడు భరత్‌పూర్ ఠాణా ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి సముఖత వ్యక్తం చేయడంతో న్యాయస్థానం ఈ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించింది. ఈ పరీక్షలు గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో జరుగుతాయని ప్రకటించారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదే తరహాలో మిగిలిన నిందిత సిబ్బందికి పైన పేర్కొన్న పరీక్షలు నిర్వహించేందుకు దర్యాప్తు బృందం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ నిందితుల్లో ఒక ఇనస్పెక్టర్, ఇద్దరు సహాయ సబ్ ఇనస్పెక్టర్లు, ఒక కానిస్టేబుల్ ఉన్నారు. వీరంతా ప్రస్తుతం సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారు.

గురుప్రియ వంతెనకు భారీగా వరద నీరు



మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలో నిర్మించిన గురుప్రియ వంతెనకు భారీగా వరద నీరు చేరుతోంది. ఈ జలాశయం నీటిమట్టం 1,516 అడుగులు కాగా, శుక్రవారం నాటికి 1514.03కు చేరింది. దీంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ పరిస్థితి తలెత్తింది. - మల్కన్‌గిరి

పొలంలోకి దూసుకెళ్లిన కారు

జయపురం: సమితిలోని సొలప గ్రామ కూడలి వద్ద ఒక కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసుకు పోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి గాయాలతో బయటపడ్డాడని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వరచంద్ర తండి శుక్రవారం వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. గాయపడిన డ్రైవర్ వివరాలు తెలియలేదని, దర్యాప్తు ప్రారంభించామని వెల్లడించారు. కుంద్ర గ్రామం నుంచి వస్తున్న కారు కలియగాం -జయపురం మార్గంలో సొలప కూడి వద్ద అదుపు తప్పినట్లు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

సత్తాచాటిన మహిళా న్యాయవాదులు

రాయగడ:

కర్ణాటక రాష్ట్రం బెంగళూర్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటుగా జరిగే ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ ఉమెన్ లాయర్స్ జాతీయ స్థాయి సమావేశంలో రాయగడ నుంచి ప్రణతి పాత్రో, పద్మాలయ మిశ్రో, శుభ్రాపండ, నిర్మల రాజు, ప్రమోదిని మహపాత్రో, దమయంతి మహానందియా తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మహిళా న్యాయవాదుల మధ్య జరిగిన వివిధ పోటీల్లో భాగంగా వంద మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న న్యాయవాది ప్రమోదిని మహాపాత్రో ప్రథమ స్థానాన్ని సంపాదించుకున్నారు. అదేవిధంగా సాముహిక నృత్య పోటీల్లో పాల్గొన్న రాయగడకు చెందిన మహిళా న్యాయవాదులు ప్రదర్శించిన సంబల్‌పూర్ నృత్యానికి ప్రథమ స్థానం దక్కింది. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో 20 రాష్ట్రాల నుంచి సుమారు 3 వేల మందికి పైగా మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రమోదిని మహాపాత్రో



నృత్యం పోటీల్లో ప్రదర్శన ఇస్తున్న రాయగడ న్యాయవాదులు

మహేంద్రగిరిలో టూరిస్టు కాటేజీలు

పర్లాకిమిడి: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం మహేంద్రగిరి వద్ద రాష్ట్ర టూరిజం శాఖ 10 టూరిస్టు కాటేజీలు నిర్మించింది. మహేంద్రగిరి కొండమీద యుధిష్టర మందిరానికి వెళ్లే దారిలో ఈ ఎకో టూరిస్టు రిసార్టులు నిర్మించారు. కాటేజీలు నిర్మించడంతో పర్యాటకులకు విడిది, రిసార్టుల వద్ద భోజన సౌకర్యాలకు క్యాంటీన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గజపతి జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ టూరిస్టు రిసార్టును అక్టోబరు మొదటివారంలో రాష్ట్ర పర్యాటక మంత్రి ప్రవాతి పరిడా చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు ఫారెస్టు అధికారులు తెలియజేశారు.



టూరిస్టు రిసార్ట్ బోర్డు



మహేంద్రగిరిలో రిసార్టులు



మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

అక్రమ మద్యం వ్యవస్థను కూలదోస్తాం

- మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: రాష్ట్రంలో అక్రమ మద్యం వ్యవస్థని సంపూర్ణంగా కూలదోస్తామని రాష్ట్ర ఎక్సైజ్, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కల్తీసారా మృత్యుకాటు నుంచి అమాయకులకు రక్షణ కల్పించే దిశలో ప్రభుత్వ కార్యాచరణ పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. కల్తీ సారా ర్యాకెట్‌ను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం కె.నువాగాంవ్ పోలీసు ఠాణా పరిధి మౌండ్‌పూర్ గ్రామంలో కల్తీ సారా మృత్యు సంఘటనపై మరో ముందడుగు వేసిందన్నారు. ఈ ఏడాది ఆగస్టు 19న జరిగిన ఈ విషాద సంఘటనలో అంచెలంచెలుగా 5 మంది అమాయక ప్రజలు అకాల మరణానికి గురయ్యారు. దీనిపై రెవెన్యూ బోర్డు సభ్యునితో దర్యాప్తు జరుగుతుందని వెల్లడించారు. ఈ మేరకు అబ్కారీ విభాగం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ దర్యాప్తు నివేదికని 2 నెలల్లో దాఖలు చేయాలని ఆదేశించారు. దర్యాప్తు పటిష్టంగా నిర్వహించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. ఇటువంటి విషాద సంఘటన పునరావృతం కాకుండా నిర్మాణాత్మకమైన మార్గదర్శకాలు ఆవిష్కరించాలని దర్యాప్తు వర్గానికి ప్రత్యేకంగా సూచించారు. ఏ కారణం వలన ఘటన జరిగింది, బాధ్యులు ఎవరు, అబ్కారీ, పోలీసు విభాగం నిర్లక్ష్యం కారణమా వంటి ప్రశ్నలు ఆధారంగా దర్యాప్తు చేపట్టాల్సి ఉందన్నారు.

- పోలీసులపై రాళ్ల దాడి
- పలువురికి గాయాలు

భద్రక్‌లో ఉద్రిక్తత


భువనేశ్వర్: సోషల్ మీడియాలో అభ్యంతరకర ప్రచారంతో భద్రక్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఒక సోషల్ మీడియా పోస్టుపై ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ వాగ్వివాదం పెచ్చుమీరి రాళ్లు రువ్వేందుకు దారి తీసింది. ఈ దాడిలో పోలీసు వర్గాలు తీవ్రంగా గాయపడ్డారు. వీరి వాహనం దెబ్బ తింది. గాయపడిన పోలీసు సిబ్బందిని తక్షణమే ఆస్పత్రిలో చేర్చారు. భద్రక్ వీధుల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగ్గురికి గాయాలు


రాళ్ల దాడిలో ముగ్గురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. మేజిస్ట్రేటు వాహనం దెబ్బ తింది. దీంతో భద్రక్ టౌను సొంథియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయి దాటడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం 7 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. అభ్యంతరకర సందేశం సోషల్ మీడియాలో ప్రసారం చేసిన నిందితుని అరెస్టు చేయాలని ఆందోళనకారులు పట్టుబట్టారు. ఈ మేరకు పోలీసులు చర్యలు చేపట్టనందున రాళ్ల దాడికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. నిందితుని అరెస్టు నినాదంతో 50 మంది పైబడి సొంథియా ప్రాంతంలో భారీ ఊరేగింపుగా వీధికి ఎక్కారు. గాయపడిన పోలీసుల్లో భద్రక్ టౌను ఠాణా అధికారి అజయ్ సుదర్శన్ బాగే, సహాయ సబ్ ఇన్‌స్పెక్టరు రోజెన్ ముర్ము, సిటీ డీఎస్పీ అంశుమాన్ ద్వివేది ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వీరిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. అజయ్ సుదర్శన్ బాగే, రోజెన్ ముర్ము చికిత్స పొందుతున్నారు.

సమూహ చర్యలు నిషేధం

ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా భద్రక్ పాత బజారు ఠాణా పరిధి వ్యాప్తంగా సమూహ చర్యలు, గుంపులుగా గుమిగూడడం, ఆందోళనలు నిషేధించినట్లు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులు నిరవధికంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ వీధుల్లో పోలీసుల పహరా ఆంక్షలను మైకు ద్వారా ప్రసారం చేసి సాధారణ ప్రజానీకానికి చైతన్యపరిచారు. భద్రక్ జిల్లా సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.



వీధుల్లో పోలీసు గస్తీ



రాళ్లదాడిలో దెబ్బతిన్న పోలీసు వాహనం



గాయపడిన పోలీసుని తరలిస్తున్న తోటి సిబ్బంది.

క్లుప్తంగా

ఉన్నతమైన విద్యతో అత్యున్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: విద్యార్థులు ఉన్నతమైన విద్య నేర్చుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని పార్లమెంట్ మాజీ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా, తమ కెరీర్‌పైన దృష్టి సారించాలని సూచించారు. మొబైల్ ద్వారా ప్రయోజనం పొందాలే గానీ, దానివల్ల నష్టం లేకుండా చూసుకోవాలని హితవు పలికారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు మూడేళ్లలో ఉన్నతమైన విద్యనేర్చుకోవాలని, కళాశాల నుంచి బయటకు వెళ్లిన తర్వాత వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయిదేవమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సత్యవిద్యాసంస్థల ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి షాజీనాయర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 40 మంది విద్యార్థుల ఎంపిక

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో 40 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తం శుక్రవారం తెలిపారు. ఇటీవల ఎంఎస్ స్క్వేర్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో రూ.4లక్షల నుంచి రూ.6 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని చెప్పారు. వారందరికీ వైజాగ్ లొకేషన్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ హెచ్ఆర్ ప్రతినిధి తెలిపారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

నాటికలు, ఏకపాత్రాభినయ ప్రదర్శనకు ఆహ్వానం

● జిల్లా ఆడిట్ అధికారి అరుణకుమారి

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అక్టోబరు 13,14 తేదీల్లో గురజాడ కళాభారతిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాటికలు, ఏకపాత్రాభినయాల ప్రదర్శన జరుగుతుందని కమిటీ సభ్యురాలు, జిల్లా ఆడిట్ అధికారి బి.అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న స్థానిక కళాకారులు తమ పేర్లను ఈ నెల 2వ తేదీలోగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కళాకారులు స్థానికులై ఉండా లని, నాటిక ప్రదర్శన గంటకు మించి, ఏకపాత్రాభినయ ప్రదర్శన (పౌరాణిక పాత్రలు) 15 నిమిషాలకు మించి ఉండరాదని స్పష్టం చేశారు. ప్రదర్శనలకు దరఖాస్తు చేసుకున్న కళాకారులకు, స్క్రూటినీ అనంతరం వారి వ్యక్తిగత ఫోన్ నంబర్‌కు సమాచారం ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబరు 2వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తోటపల్లి బ్యారేజ్ యూనిట్-3 (7396832929), ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (9515129843) కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

విద్యార్థులందరికీ భగవద్గీత

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించేందుకు అందరికీ భగవద్గీతను అందజేయడమే తమ లక్ష్యమని టీటీడీ ప్రోగ్రామింగ్ మేనేజర్ జె.శ్యామ్ సుందరరావు తెలిపారు. ఈ మేరకు టీటీడీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం, మన్యం జిల్లాల్లో భగవద్గీతను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మాత్రమే వీటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. భగవద్గీత కావాల్సిన వారు ఫోన్ 9441461076 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా శిరీష

విజయనగరం టౌన్: దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా కె.శిరీష శుక్రవారం తోటపాలెంలో ఉన్న కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ పనిచేసిన కె.ఎల్.సుధారాణి అనకాపల్లి దేవదాయశాఖ సహాయ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. శిరీష విశాఖపట్టణం దేవదాయశాఖలో రెండేళ్లుగా అసిస్టెంట్ కమిషనర్‌గా, కనకమహాలక్ష్మి ఆలయం ఇన్‌చార్జిగా పనిచేశారు. ప్రస్తుతం సంపత్ వినాయక ఆలయం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. జిల్లాలో దేవదాయశాఖ భూముల ఆక్రమణల తొలగింపు, కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టిసారిస్తానని తెలిపారు.

టీడీపీ నాయకులే ప్రజాప్రతినిధులు

● మారని అధికారుల తీరు
● ఇష్టానుసారం గ్రామసభల నిర్వహణ

సాలూరు రూరల్: మండలంలో జరుగుతున్న గ్రామ సభలలో టీడీపీ నాయకులే ప్రజాప్రతినిధుల్లా వ్యవహరిస్తున్నారు. దీనికి ఆ పంచాయతీ సెక్రటరీలే సూత్రధారులుగా మారుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదపదం పంచాయతీలో శుక్రవారం జరిగిన గ్రామసభలో టీడీపీ నాయకుడు ఎం.శ్యామ్ ప్రజాప్రతినిధులు కూర్చోవలసిన స్థానంలో కూర్చుని గ్రామసభను నిర్వహించారు. ఇటీవల జరిగిన మండల సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల తీరును ఎండగట్టారు. అయినా తీరు మార్చుకోకుండా టీడీపీ నాయకులకే అధికారులు వత్తాసు పలుకుతూ గ్రామసభలు వారితోనే నిర్వహించడం సర్వసాధారణంగా మారింది. కొత్తు పరువు పంచాయతీలో కూడా అక్కడి టీడీపీ నాయకులతోనే గ్రామసభను నిర్వహించారు. సాలూరు మండలంలో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులే కావడంతో.. అధికారులను భయపెట్టి మరీ టీడీపీ నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. దానికి అధికారులు కూడా వత్తాసు పలుకుతూ వారికి అనుగుణంగానే నడుచుకుంటున్నారు.


పెదపదం సచివాలయంలో గ్రామసభలో ప్రజాప్రతినిధుల స్థానంలో కూర్చున్న టీడీపీ నాయకుడు శ్యామ్

అధికారుల తీరుమారదా..?

గ్రామసభల్లో టీడీపీ నాయకుల పెత్తనానికి అవకాశం ఇస్తున్న అధికారులు తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు కూర్చోవాల్సిన స్థానంలో టీడీపీ నాయకులను కూర్చోండపెట్టడంపై పలువరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామసభను ప్రారంభించండి. 15 నిమిషాల్లో సభలో పాల్గొంటానని చెప్పాను. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు లేకుండా సెక్రటరీ రోహిణి టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో గ్రామసభను ముగించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాను.
రెడ్డి సురేష్, వైస్ ఎంపీపీ

కేజీ గంజాయి పట్టివేత

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు శుక్రవారం ఒక కేజీ గంజాయిని పట్టుకున్నారు. దీనిపై ఎస్సై వెంకటసురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా, ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి పోలీసులు సోదా చేశారు. ఈ క్రమంలో వారిదగ్గర ఉన్న గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని సుంకి వద్ద గంజాయిని కొనుగోలుచేసి వారు తీసుకువచ్చినట్లు తెలుసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని ఎస్సై తెలిపారు.

తూలుతూ తోలితే ఖబడ్దార్..!

● మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు
● ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక


మద్యం మత్తులో పట్టుబడిన వాహనచోదకులకు కౌన్సెలింగ్ చేస్తున్న ట్రాఫిక్ సీఐ

విజయనగరం క్రైమ్: మద్యం తాగి ఆ మత్తులో వాహనాలు నడిపిన వారిపై కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ వాహనచోదులకును హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపి స్వయంగా ప్రమాదాలకు గురికావడం, ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. అటువంటి వాహనచోదకులను కట్టడి చేసేందుకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రత్యేకంగా డ్రైవ్ చేపడుతున్నామన్నారు. మద్యం తాగి ప్రమాదాలకు కారకలవుతున్నారన్న విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న న్యాయస్థానాలు కూడా మద్యం తాగి పట్టుబడిన వాహనదారులపై కఠినచర్యలకు ఉపక్రమిస్తున్నాయని చెప్పారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సైలు శంబంగి రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరాజు, చిన్నారావులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 23 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుచేసి, వారిని న్యాయస్థానం ముందు హాజరుపర్చగా, వారందరికీ లక్షా రూ.20వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్పీ చెప్పారు. మద్యం తాగి పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, రహదారి ప్రమాదాలకు కారకులు కావద్దని, తమపై ఆధారపడి జీవించే భార్యాపిల్లలు, ఇతర కుటుంబసభ్యుల గురించి ఆలోచించాలని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ముచ్చటగా ముగ్గురే ..!

● అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గుతున్న పిల్లల సంఖ్య


గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ముగ్గురు పిల్లలు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గుతోంది. కేంద్రాల పరిధిలో ఎక్కువ మంది పిల్లలున్నప్పటికీ కేంద్రాలకు మాత్రం తక్కువగా పిల్లలు హాజరవుతున్నారు. 10 మంది, 15 మంది ఉండాల్సిన కేంద్రాల్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉంటున్నారు. కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు అనధికారికంగా విధులకు డుమ్మా కొడుతున్నారు. కేంద్రాలకు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పట్టణంలోని ఇందిరానగర్ -1 కేంద్రంలో ముగ్గురు పిల్లలు, కార్యకర్త, ఆయా ఉన్నారు. 12:20 గంటల సమయంలో గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు పిల్లలు, ఆయా మాత్రమే ఉంది. కార్యకర్త కేంద్రంలో లేరు. ఈ కేంద్రం పరిధిలో 8 మంది పిల్లలు ఉన్నారు. ఇదే విషయాన్ని అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ జి. ప్రసన్న వద్ద సాక్షి ప్రస్తావించగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు తక్కువగా ఉండడం, కార్యకర్త లేకపోవడంతో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'దివ్య'మైన ప్రతిభ

● అగ్రికల్చర్ రీసెర్చ్ పరీక్షలో ఆలిండియా 91వ ర్యాంకు


దివ్యదర్శిని

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): అగ్రికల్చర్ రీసెర్చ్ కౌన్సిల్ పరీక్షల్లో ఎస్సీ కేటగిరిలో ఆలిండియా 91వ ర్యాంకును పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని దొనక వీధికి చెందిన దొనక దివ్య దర్శిని సాధించింది. ఆమె బాపట్లలో ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి అగ్రికల్చర్ రీసెర్చ్ పరీక్ష రాసి 91వ ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి దొనక కిశోర్ ఉద్యోగరీత్యా నెల్లిమర్లలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. ఆలిండియాలో 91 ర్యాంకు తమ కుమార్తె సాధించడం పట్ల తల్లిదండ్రులతో పాటు బంధువులు దివ్యదర్శినిని అభినందించారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

● ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవ


కురుపాం ఏకలవ్య పాఠశాలను పరిశీలిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవ

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యంతో పాటు జీవనోపాధి మెరుగుకు కృషి చేస్తానని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురం వైటీసీలోని గిరిశిఖర గ్రామాలకు చెందిన గర్భిణుల వసతి గృహాన్ని సందర్శించి, వైటీసీ, గర్భిణుల వసతి గృహం నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణులతో మాట్లాడుతూ వసతిగృహంలో అందిస్తున్న భోజన, వసతి, వైద్య సదుపాయాలపై ప్రశ్నించారు. వసతి గృహంలోని గర్భిణుల పట్ల నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, సమయానికి ఆస్పత్రులకు తరలించి, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని, ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సుమారు రెండేళ్లుగా తమకు గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, మంజూరు చేయాలంటూ వైటీసీ, గర్భిణుల వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పీఓ దృష్టికి తీసుకురాగా ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గిరిజన ప్రజలకు విద్య, వైద్యం సంపూర్తిగా అందించడం, వారి జీవనోపాధి మెరుగుపరచడం తన ముందున్న కర్తవ్యమని చెప్పారు. దీనికి ముందు ఆయన కురుపాంలో నిర్మాణంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

విజయోస్తు..!

● రాష్ట్రస్థాయి పోటీల్లో గెలిచిన నిలవాలి
● వినుకొండలో ఫుట్‌బాల్ పోటీలకు అండర్-17 జట్ల పయనం


ఫుట్‌బాల్ పోటీలకు వెళ్తున్న అండర్-17 జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ బా ల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకా రులు ఉత్తమ క్రీడాప్రతిభతో విజేతలుగా నిలవాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వి.కృష్ణంరాజు ఆకాంక్షించారు. ఈనెల 28నుంచి30వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరగనున్న అండర్-17 బాల, బాలికల అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు శుక్రవారం పయనమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాల,బాలికల జట్లు ప్రతిభ కనబరిచి విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, జట్టు కోచ్ అండ్ మేనేజర్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అండర్-19 తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 బాల,బాలికల స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. శుక్రవారం అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 30 మంది క్రీడాకరులు హాజరుకాగా..అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8మంది బాలికలు, ఆరుగురు బాలుర క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పీవీఎల్.కృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 4, 5 తేదీల్లో రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరగనున్న అంతర్‌జిల్లాల తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3వ తేదీన ఉదయం 9 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్ వద్దకు హాజరు కావాలని సూచించారు.


రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన స్కూల్‌గేమ్స్ జట్లు

అండర్-14,17 టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పూర్తి

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-14,17 బాల, బాలికల స్కూల్‌గేమ్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పీఎస్ఆర్‌స్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఎంపికల్లో వివిధ పాఠశాలలకు చెందిన 50మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.ఎంపికైన క్రీడాకారులు త్వరలో నంద్యాల జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల స్కూల్‌గేమ్స్ బాల,బాలికల టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజయనగరం జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఈ ఎంపిక పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్ తదితరులు పర్యవేక్షించారు.


రాష్ట్రస్థాయి అండర్-19 తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లాక్రీడాకారులు

నేడు అండర్-19 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల, బాలికలకు సెపక్‌తక్రా క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నామన్నారు. విజయనగరంలోని రింగ్‌రోడ్‌లో గల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహిస్తామని, అదే విధంగా పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల,బాలికలకు సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. ఎంపిక పోటీల్లో 8వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ అభ్యసిస్తున్న 19 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాబు పాప ప్రక్షాళనకు పూజలు

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: కలియుగ ప్రత్యక్ష దైవం, దేవదేవుడైన తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాద విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసత్య ప్రచారాలతో చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నేడు (శనివారం) సాలూరు పట్టణంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ముందుగా వారివారి గ్రామాలు, వార్డుల్లో గల స్థానిక ఆలయాలకు వెళ్లి 9 గంటలకు పూజలు చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం అందరూ సుమారు 10 గంటల సమయానికి పట్టణంలోని తన గృహం వద్ద గల వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. అందరితో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కాడెడ్లు మృత్యువాత


విద్యుత్ షాక్‌తో పంటకాలువలో మృతిచెందిన కాడెడ్లు

బొబ్బిలిరూరల్: రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఆ రైతుది. తన దగ్గర ఉన్న రెండు ఎడ్లను జీవనాధారం చేసుకుని బండికట్టి ఇంటిని పోషించుకుంటున్నాడు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో నేడు ఆ రెండు ఎడ్లను పోగొట్టుకుని భోరున విలపిస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన బేతనపల్లి తిరుపతిరావు తనకున్న జోడెడ్లతో గ్రామంలోని ఇళ్ల నిర్మాణాలకు వేగావతి నది నుంచి ఇసుకను తరలిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం వేగావతి వైపు వెళ్తూ మార్గమధ్యంలో పారాది చానల్‌ను దాటుతుండగా, పంటకాలువలో వైద్యుత్ వైరుతెగిపడి ఉంది. అది గమనించని రైతు తిరుపతిరావు యథావిధిగా ఎడ్లబండిని పంటకాలువలోకి దించాడు. విద్యుత్ వైర్లలో విద్యుత్ ప్రవహిస్తుండడంతో రెండెద్దులు గిలాగిలా కొట్టుకుంటుండగా యజమాని తిరుపతిరావు బండిపై నుంచి గట్టుపైకి దూకి ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. కానీ ఎద్దులు నీటిలో కొట్టుకుంటూ చనిపోవడాన్ని చూసి జీర్ణించుకోలేకపోయాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి రైతులు అక్కడికి చేరుకుని బాధిత రైతును ఓదార్చారు. తనను రక్షించి కాడెడ్లు బలయ్యాయని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై బాధిత రైతు శాపనార్థాలు పెట్టాడు. కొన్ని రోజులుగా విద్యుత్‌వైర్లు వేలాడుతున్నాయని ఆశాఖ అధికార సిబ్బందికి చెప్పినా నిర్లక్ష్యభావంతో వ్యవహరించడమే ఈ ప్రమాదానికి కారణమని తోటి రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో కూడా దీనిపై ప్రశ్నించామని అయినా వారి వైఖరి మారడం లేదని, ఫలితంగా రైతులు తమ ప్రాణాలతోపాటు ప్రాణప్రదంగా చూసుకునే మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని విమర్శించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.

రైతు తిరుపతిరావును ఆదుకోవాలి

తన కుటుంబానికి ఆసరాగా ఉన్న కాడెడ్లను కోల్పోయిన రైతు తిరుపతిరావుకు విద్యుత్‌శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతుసంఘం మండల అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఆ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, పర్యవేక్షణ లేక అనేక మంది ప్రాణాలను బలిగొంటున్న ఆ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్
● 120 మందికి స్క్రీనింగ్, రక్తపరీక్షలు నిర్వహించిన వైద్యనిపుణులు



పోలీసు ఉద్యోగుల స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో తిరుమల మెడికవర్ ఆస్పత్రి సహకారంతో పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించేందుకు శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రతకు పోలీసుశాఖ శక్తివంచన లేకుండా పనిచేస్తూ, తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడం వల్ల, అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడు అత్యంత ఫిట్‌గా ఉండే పోలీసులు, ఉద్యోగ విరమణ సమయానికి అనేక రకాలైన ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి, సమయానికి భోజనం చేయకపోవడం, వంటి కారణాలతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తిరుమల మెడికవర్ ఎం.డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పోలీసులకు సీపీఆర్ శిక్షణ ఇప్పించేందుకు ఎస్పీ చొరవ చూపడం, సొసైటీకీ పోలీసులు ఎంతో మేలు చేసే అవకాశం ఉంటుందన్నారు. పోలీసులకు ఏ వైద్య సహాయం అవసరమైనా అందించేందుకు తమ ఆస్పత్రి వైద్యులు సిద్ధంగా ఉంటారని చెప్పారు. పోలీసు ఉద్యోగులు, కుటుంబసభ్యులు 120 మందికి వివిధ రంగాల్లో నిపుణులైన వైద్యులు, స్క్రీనింగ్ పరీక్షలు, షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, వైద్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన డైట్ గురించి వివరించారు.

వైద్యులకు సత్కారం

వైద్యసేవలందించిన డాక్టర్‌లను, ఎం.డి డాక్టర్ తిరుమల ప్రసాద్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ బి.రవికిశోర్, డాక్టర్ దుర్గాసాయి, డాక్టర్ షరీస్‌భట్, డాక్టర్ వేదవతి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ అనూష, డాక్టర్ రామారావు, డాక్టర్ వెంకట సాంబశివరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, సీఐలు ఏవీ.లీలారావు, ఆర్.చౌదరి, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, టి.భగవాన్, ఆర్. రమేష్ కుమార్, ఆర్ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించి.. మురిపించి..


ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలను జెండా ఊపి ప్రారంభిస్తున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తేజస్వి కట్టిమణి

విజయనగరం టౌన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, మాన్సాస్ విద్యా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక విభాగం సంయుక్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించాయి. తొలుత పైడితల్లి అమ్మవారి గుడి నుంచి కోటలోని రౌండ్ మహల్ వరకూ వివిధ దేశాల వస్త్రధారణలతో విద్యార్థినీ, విద్యార్థులు కల్చరల్‌వాక్ ర్యాలీతో మురిపించారు. రౌండ్ మహల్‌లో కోలాటం, గిరిజన సాంస్కృతిక థింసానృత్యాలు, స్కిట్‌లతో అలరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ విజయనగరంలోని చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తే ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా, ఆర్థికంగా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. విజయనగరం కోట కేవలం ఒక చారిత్రక కట్టడమే కాదని, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. గిరిజన వర్సిటీ వైస్ చాన్సలర్ తేజస్వి కట్టిమణి మాట్లాడుతూ విజయనగరం పర్యాటక, శాంతి, సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర వహించేదిగా ఎదగాలన్నారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. గిరిజన వర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా స్వాగత ప్రసంగం చేయగా రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.వి.లక్ష్మీపతిరాజు, శరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


పలు దేశాల వస్త్రధారణలో విద్యార్థులు